తర్వాత నా పరిచయం సైతం మీకు ప్రమాదమే అని చెప్పాలనుకున్నాడు.

అసలు ఆమెను కలుసుకోవడమే తనకు ఇష్టం లేనట్టు తల తిప్పుకోబోయాడు.

కాని. . .

కృషి అతడికి ఆ అవకాశం ఇవ్వలేదు.

నెమ్మదిగా ఓ చిరుగాలి అలలా అతడ్ని సమీపించింది.

ఘనీభవించిన ఏ ఆలోచనల పొరలో ఉన్నట్టుండి ద్రవించినట్టు హఠాత్తుగా అతడ్ని చేరి పెదవులపై బలంగా ముద్దుపెట్టుకుంది.

ఇద్దరికీ తెలీదు చౌదరి మనుషులు అప్పటికే అ కుటీరాన్ని చుట్టుముట్టారని.

0 0 0

సరిగ్గా అదే సమయంలో. . .

పది నిముషాలుగా చౌదరి ఫోన్‌లో కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి గంగాధరంతో మాట్లాడుతున్నాడు చాలా ఆవేశంగా. . .

"మనం వియ్యంకులం కావాల్సిన ఆఖరి క్షణంలో పెళ్ళి కేన్సిల్ చేయడం నేను భరించలేని విషయం గంగాధరం. ఇంత పరపతిగల నేను రేపు తలెలా ఎత్తుకోను"

"సారీ చౌదరీ. . . . నీతో వియ్యానికి సిద్ధపడితే నేను ఇరుక్కుపోతాను. . . పార్లమెంటులో సైతం నీ చాక్‌లెట్ ఫ్యాక్టరీ విషయం చర్చించబడింది. అంటే నువ్విప్పుడు పూర్తిగా వూబిలో కూరుకుపోయావు."

"ఇవన్నీ చాలా మామూలు విషయాలు గంగాధరం"

"నువ్వంత ఈజీగా ఎలా తీసుకోగలుగుతున్నావో నాకు అర్థం కావడంలేదు - రేపు చాక్‌లెట్స్‌లో 'నికెల్' వున్న విషయం మన లేబరేటరీస్‌లో నిరూపించబడితే వినియోగదారుల సంఘాలు నష్టపరిహారాల కోసం కోర్టులో దావావేస్తే నీ ఆస్థి మొత్తం హరించుకుపోవడమే కాదు, నువ్వు జైలుకెళ్ళడమూ తప్పనిసరి అవుతుంది."

"నాకా భయం లేదు"

"ఇది చిన్న విషయం కాదు చౌదరీ. . . ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిన ప్రమాదకరమైన నిజం. అంటే నివ్వెంత ధారుణమైన నేరానికి సిద్ధపడ్డదీ జాతీయస్థాయి కాదు అంతర్జాతీయ స్థాయిలో చర్చించబడుతుంది. అప్పుడు నీ చాక్‌లెట్స్ ఎగుమతి చేసిన దేశాల ప్రభుత్వాలు మన ప్రభుత్వం ముఖ్యంగా దేశ ప్రధాని మీద ఒత్తిడిని తీసుకొచ్చి ఎక్స్‌ట్రెడిషన్‌ట్రిటీ ప్రకారం నిన్ను ఆయా దేశాలకు నేరస్థుడిగా అప్పగించవచ్చు కూడా"

"పసిపిల్లల్ని బెదిరించినట్టు మాట్లాడుతున్నావ్"

"నేను చెప్పేది అతిశయోక్తి కాదు చౌదరీ. . . పచ్చి నిజం. ఇప్పటికే కేంద్ర రాజకీయవర్గాలు మాట్లాడుకుంటున్న విషయం యిది. . ."

క్షణాలు దగ్గరపడుతున్నాయా. . .దశాబ్దాల కృషితో సంపాదించుకున్న ప్రతిష్ఠకి తిలోదకాలిచ్చి జైలులో గడిపే పరిస్థితి దాపురించ బోతూందన్నమాట.

"గంగాధరం. . . నన్ను కాపాడు" చౌదరి కంఠం వణికింది జరగబోయేది జ్ఞప్తికి వస్తుంటే "నేను నీకు వియ్యంకుడ్ని కావాలన్న ఆశలేదు. కనీసం నీ సహాయంతో ఈ గండం గట్టెక్కాలనుంది."

నిజమే. . . కృషి కోట బురుజుల్ని మాత్రమే పగలగొడితే ఒక్క దెబ్బతో విష్ణు కోట పునాదికే డైనమైట్ పెట్టేశాడు - నమ్మకస్థుడిలా నటించి బయటకు రాలేని వ్యూహంలోకి నెట్టేశాడు. . .

"చౌదరీ" గంగాధరం గొంతులోనూ అణువంత ఆందోళన ధ్వనించింది. "ముందు నన్ను కాపాడుకోవాలి. ఎందుకంటే నీకేదో సహకరించబోయానని ప్రధానమంత్రి కూడా గుర్రుగా వున్నాడు కాబట్టి. ఇది నిజం చౌదరీ. ప్రతిపక్షాల రాద్ధాంతం ఇలానే కొనసాగితే నేను పదవి వదిలిపెట్టాల్సి వుంటుంది. కనీసం పార్టీ ప్రతిష్ఠ దక్కించుకోవడం కోసం"

"అయితే ఏమీ చెయ్యలేనంటావ్"

"నేనున్నదే అద్దాలమేడ. ఈ అభియోగంతో పగలడం ప్రారంభించింది. నిన్ను నేను ఎలా కాపాడగలను "

"మీ పార్టీకి కోట్లు ఫండ్స్‌గా ఇచ్చాను"

"కాదనను. కాని ప్రభుత్వానికి ప్రమాదం వచ్చినప్పుడు రాజకీయ నాయకులు ఫండ్స్ ఇచ్చిన వాళ్ళకన్నా పదవుల్ని కాపాడుకోవడమే ధ్యేయంగా పెట్టుకుంటారు. అది సాంప్రదాయం" అసహనంగా అన్నాడు గంగాధరం "అసలు ఈ విషయం బయటికెలా వచ్చింది."

చౌదరి ఉక్రోషాన్ని ఆపుకోలేకపోయాడు "మా కుర్ర వెధవ ఆ విష్ణు గాడితో కక్కేసాడు. నాకొంప ముంచాడు."

"అలాంటి కొంపముంచే అలవాటు గలవాడ్ని నేను అల్లుడ్ని చేసుకుంటే మరి నా కొంపా ముంచేసే వాడుగా. అది గాకుండ మీ వాడు ఎంతో గొప్ప గ్రంధసాంగుడని కూడా తెలిసింది."

మరణించిన జీవిత అఫైర్ గురించి పరోక్షంగా వ్యక్తం చేస్తున్నాడని అర్ధమైపోయింది. ఆ క్షణంలో సైతం కొడుకు మీద ద్వేషం కన్నా దీనికంతటికీ మూలకారకుడైన విష్ణూ మీద ఆవేశాన్ని ప్రదర్శించాడు చౌదరి "ఇంతచేసిన విష్ణు గాడ్ని నేను విడిచి పెట్టడం లేదు గంగాధరం. ఈ రాత్రే వాడ్ని కడతేర్చ బోతున్నాను."

ఫోన్ క్రెడిల్ చేసిన చౌదరి అప్పటికి ఆశ్రమానికి వెళ్ళిన తన బలగం విష్ణూని ఫినిష్ చేసేసి వుంటారని భావించాడు.

కాని అక్కడ పరిస్థితి వేరు.

హఠాత్తుగా గదిలోకి వచ్చిన కృషి వున్నట్టుండీ ముద్దుపెట్టుకోవడంతో ముందు కలేమో అనుకున్నాడు విష్ణు.

కాని అది నిజమే అని తెలుసుకునే సరికి మెదడు మొద్దుబారిపోయింది.

స్వేదం చినుకుల జడి మేలిముసుగులా శరీరాన్ని తడిపేస్తుంటే మనోగీత సంకేతాల కేతనాల్లా ఆలోచనలు అతడ్ని వివశుడ్ని చేసాయి.

స్పందించిన హృదయం అందించిన చలిగాలిలో వెచ్చటిస్పర్శల ఆ క్షణం నిగ్రహాన్ని కోల్పోయాడు.

జరిగిన సంఘటనల స్మృతులు మురళీ సృతులై గతి తప్పిన స్వర జతులై క్షణాల వీక్షణాలై సుతారంగా మోగే సారంగ ధ్వనుల లయలై ప్రియా విదగ్ధ పరిష్వంగ అమృత జరులై ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే -

“ఏమిటిది ” అన్నాడు గభాలున వెనక్కి జరిగి.

“మొన్న నువ్వు అడిగినా నేను ఇవ్వంది ఈ రోజు నువ్వు అడగవని తెలిసినా ఆనందంగా ఇచ్చింది.” కృషి కంఠంలో మామూలు స్నిగ్ధదరహాసమే. నిన్న కాదన్నా వెచ్చని కోరికల ఇంద్రజాల పేటికనుంచి బయటపడి చేసిన ఆ సాహసంలో ఎంతటి లాలిత్యం వున్నా ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాడు విశ్వ. రెప్పలార్పకుండా చూస్తున్న కృషి నేత్రాల్లో ఉద్రిక్త యౌవన శిఖరాగ్రాన్ని అధిరోహించిన భావం ద్యోతకం కావటం లేదు. నిన్న వర్షించనని మొరాయించిన ఓ మేఘం పులకింతగా వర్షించిన తొలకరి జల్లు వేళలో అణువంత ఆవిరితో పరిమిళింత భూదేవి స్వగంధంలా వుంది”

“నమ్మలేక పోతున్నాను” గొణుగుతున్నట్టుగా అన్నాడు.

“నా ఇష్టాన్నా”

“నన్ను ఇష్టపడగలవనే నిజాన్ని”

“ఇంకా ఏం చేసి నమ్మించను”

జవాబు లేనట్టుగా చూశాడు విశ్వ. . .

“మనసు పడ్డ అమ్మాయి తన అభీష్టాన్ని క్షణంలో వ్య క్తం చేయటానికి వున్నది ఈ ఒక్క ఆధారమే అయితే నేను ఇప్పుడు చేసింది అదే విశ్వా. . . ఇందులో”’ క్షణం ఆగింది బిడియంలా తలవంచుకుని “నా ఓటమిలేదు - నిన్నటి ఓటమి పై నేను సాధించిన గెలుపులానే అనిపిస్తూంది. ఇది నటన కాదు విశ్వ - కోరుకున్న మగాడి ముందు తన జీవితాన్ని పదిలంగా అందించటానికి నేను సిద్ధమని చెప్పటానికి నాకు తెలిసిన మార్గం ఇదొక్కటే. . .హఠాత్తుగా ఎందుకిలా మారావూ అంటే నా దగ్గర జవాబు లేదనుకోకు. ఉంది. చౌదరి సామ్రాజ్యం మీద నేను దాడి ప్రారంభించి ఎన్ని నెలలూ రోజులూ గడిచినా ఎంత గెలిచానో నాకు స్పష్టంగా తెలీదు కాని నువ్వు సాధించిన దాని ముందు నేను చేసింది చాలా స్వల్పమే అని మాత్రం అర్థం చేసుకున్నాను. . . అదొక్కటే కాదు విశ్వ - నీలో ఇంకా చావని మానవత్వం, విలువలు నన్ను బలంగానే కదిలించాయి. ఈ మాట ఎందుకంటున్నానూ అంటే మా కుటుంబం మీద పగ

స్పందించాల్సిన అగత్యం లేదు.  కాని మూవ్ అయ్యావు. . . అదే. .  .సరిగ్గా అదే నీ ముందు నేను ఓడితేనేం అనిపించిన తొలిక్షణం. . . ఆ తర్వాత నిన్ను నువ్వు నిర్దేశించుకున్న మార్గం నుంచి పక్కకు జరిగి నువ్వు చౌదరిపై ఎలాంటి చావు దెబ్బ తీసావూ అంటే ఈ రోజు చౌదరి ప్రాణాలుగ్గ బట్టుకుని బ్రతుకుతున్నాడు - నీ మీద నేను ఇష్టం పెంచుకోవటానికి ఇదొక్కటే కారణం కాకపోయినా పెంచుకోకపోవటానికి అభ్యంతరం మాత్రం కనిపించలేదు విశ్శు. . . అయితే చివరిగా మరో విషయం. .  . ” విశ్శు వున్న ప్రస్తుత మానసిక స్థితిలో ఆ విషయం ప్రస్తావించడం ఎంతవరకూ సమంజసమో ఆమె ఆలోచించలేదు  “నీ తండ్రి హత్యకి కారణం మా గ్రాండ్‌పా మాత్రం కాదు.”

“వద్దు. .  . ఇప్పుడా విషయం మనం మాట్లాడుకోవద్దు” విశ్శు కంఠంలో ఇంకా అదే మొండితనం. . .

బాధగా చూసింది.  ఏం చెప్పి నమ్మించాలీ వ్యక్తిని, ఏం చేసి ఈ మనిషికి నిజాన్ని నిరూపించాలి.

“ఆవేశంతో కాదు విశ్శు - కూల్‌గా ఆలోచించు. . .  ఇలా అడుగుతున్నది నిన్నటి దాకా నీకు ప్రత్యర్థిగా నిలబడ్డ ఉపాధ్యాయ మనవరాలు కృషికాదు . .  . తన ఆడతనాన్ని నిర్లజ్జగా నీకు అర్పించటానికి సిద్ధపడి వచ్చిన ఓ అమ్మాయి.”

“ కృషీ. .  .” కాలిన ఏ చితిమంటల కాగడాలో అతడి కళ్ళలో ప్రతి ఫలిస్తుంటే బడలికగా కళ్ళు మూసుకున్నాడు. “నేను చేసిన పొరపాటు ఉపాధ్యాయగారి మీద ఆవేశాన్ని నీ మీద ప్రకటించడమూ నిన్ను హింసించటానికి సిద్ధపడటమూను.  కాదనను.  అయితే నువ్వే ఓ విషయం అర్థం చేసుకోవాలి. నేనిప్పుడు గాయపడి వున్న మృగాన్ని.  అలా గాయమైంది కేవలం మీ గ్రాండ్‌పా ఒక్కడి మూలంగానే కాదు. చౌదరి మూలంగా కూడా అని తెలుసుకోబట్టే ఇప్పుడు అటు కూడా ఓ అస్త్రాన్ని సంధించాను.  దాని ఎఫెక్టు ఎంతన్నది వదిలేద్దాం”

వెయ్యి పేజీల ప్రేమకథని మనసుతో కుదించి నిర్వచిస్తే వట్టి రెండక్షరాల పదం ‘ముద్దు’ అయితే అది కూడా విశ్శుని మార్చలేకపోయింది. కృషి టార్గెట్ కాదని అతడికెప్పుడో తెలుసు. .  . ఆమె ద్వారా ఓ మార్గాన్ని కోరుకున్నాడు తప్ప ఆమెని ప్రేమించడమూ లేక ఆమె చేత ప్రేమించబడటమూ అన్నది అతడి అసలు లక్ష్యం కాదు - అందుకే ఇప్పుడూ నిక్కచ్చిగా మాట్లాడాడు.

మరో అర నిముషంలో ఓటమిలాంటి భావంతో ఆమె బయటికి నడిచేదే. . .

అదిగో అప్పుడు వింది తలుపు తట్టిన శబ్దాన్ని.

ముందు అవాక్కయిపోయింది విశ్శూ. . . .

అలాంటి వేళలో అరుదుగా అయినా తనను వచ్చి కలిసేది సూరి మాత్రమే.

అందుకే నిర్భయంగా తలుపు తీసాడు.

సర్రున చీరుకుపోయిన విశ్వా అరచేతి రక్తం అతడి కదలికలో కృషి మొహంపై పడింది.

జరుగుతున్నదేమిటో గ్రహించిన కృషి వెనుకడుగు వేయలేకపోయింది.

లోనికి ఎందరు దూసుకొస్తున్నదీ ముందు అర్థం కాలేదు. . . మరో వ్యక్తి చేతిలోని డేగర్‌లాంటి ఆయుధం యిప్పుడు కృషిని తాకబోతుంటే ఒక్క వుదుటున ఆమెను వెనక్కి లాగేసిన విశ్వ ఇందాక గాయమైన చేతితోనే ఆయుధాన్ని ఒడిసిపట్టుకున్నాడు.

మెరుపు వేగంతో కదిలిన వ్యక్తులు అదే వూపులో కృషిని విశ్వనీ ముక్కలుగా నరికేసేవారే. . .

అప్పుడు వినిపించింది పోలీసుల బూట్ల చప్పుడు. వెనువెంటనే ఎసిపి మాథూర్ అక్కడ ప్రత్యక్షమై అగంతకులకి రివాల్వర్ గురిపెట్టాడు. . .

"డ్రాప్ యువర్ వెపన్స్" మాథుర్ కంఠం ఖంగుమంది.

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

రామనాథ చౌదరికి చెందిన ఆరుగురు అనుచరుల్నీ కస్టడీలోకి తీసుకున్నాడు మాథుర్.

ఏమీ జరగనంత ప్రశాంతంగా వుంది ఆశ్రమం. . . చౌదరి అనుచరుల్ని వేన్‌లోకి నెట్టి స్టేషన్‌కి పంపేక వెనక్కి వచ్చిన మాథుర్ "మీ అంచనా తప్పుకాలేదు మిస్ కృషి... యూ ఆర్ రైట్" అన్నాడు కృషిని చూస్తూ.

విశ్వకి వెళ్ళాలని లేకపోయినా బలవంతంగా హాస్పిటల్‌కి తీసుకువెళ్ళింది. చేతికి బేండేజ్ కట్టేక ఎసిపి మాథుర్ స్టేట్‌మెంట్ తీసుకోవటం మరిచిపోలేదు.

కృషి వెళ్ళిపోయింది నిశ్శబ్దంగా . . . ఎసిపి మాథుర్ విశ్వని ఆశ్రమం దగ్గర డ్రాప్ చేసాడు మరో అరగంటకల్లా. . .

"నాకో ప్రశ్నకి జవాబు చెబుతారా" అడిగాదు విశ్వా.

"ష్యూర్"

"కృషి అంచనా తప్పు కాలేదన్నారిందాక. అంటే నా మీద చౌదరి మనుషుల అటాక్ జరిగే అవకాశముందని కృషి మీకు ముందే చెప్పిందా"